# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 51 | విశాఖపట్నం | 21-11-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 51 | VISAKHAPATNAM | 21-11-2025 FRIDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

### వైఎస్సార్సీపీ కార్యకర్తల హల్‌చల్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** అక్రమాస్తుల కేసులో వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. మరోవైపు వైఎస్సార్సీపీ నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే ఆగిపోయారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కావడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగించే పిటిషన్‌పై వాదనలకు సునీత హాజరయ్యారు. ఈ కేసులో నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్ రెడ్డి, శివశంకర్ రెడ్డి వాదనలు వినిపించారు. అదే సమయంలో అక్రమాస్తుల కేసులో జగన్ కోర్టుకు హాజరయ్యారు. ఒకరికొకరు ఎదురుపడ్డా సునీతను చూసి కూడా జగన్? పలకరించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఒకే కుటుంబానికి చెందిన బాధితులు, నిందితులు ఒకేసారి కోర్టుకు హాజరయ్యారంటూ పలువురు అభిప్రాయపడ్డారు. జగన్ నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు హాజరుతో అక్కడికి చేరుకున్న వైఎస్సార్సీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. కోర్టు సమీపంలో రోడ్డుపై గుంపులుగా చేరి నినాదాలు చేశారు. '2029లో రప్పా రప్పా' అంటూ రాసి ఉన్న బ్యానర్లు ప్రదర్శించారు. వైఎస్సార్సీపీ శ్రేణుల హల్‌చల్‌తో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అంతకుముందు బేగంపేట ఎయిర్‌పోర్టు వద్దకు ఆయన చేరుకోవడంతో పెద్దఎత్తున వైఎస్సార్సీపీ కార్యకర్తలు అక్కడ హల్‌చల్ చేశారు. దీంతో బేగంపేటలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

## ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తాం: నాదెండ్ల



**తాడేపల్లి, పతాకం న్యూస్:** రైతుల వద్ద నుండి ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తామని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు, చిర్రావూరు గ్రామాలలో కూటమి నాయకులతో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. రైతులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ముందుగా ప్రాతూరు గ్రామంలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిర్రావూరు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతుల పడ్డ ఇబ్బందులను తెలుసుకొని, రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేల రైతు సహాయ కేంద్రాలు ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాక, రైతుల ఖాతాల్లో మూడు గంటల్లోనే నగదు జమ చేస్తున్నామన్నారు. 14 వేల కోట్లు దాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందన్నారు. 17 శాతం నుండి 24 శాతం వరకు రైతుల వద్ద కొనుగోలు చేసిన (తరువాయి 2వ పేజీలో)

## ఆపరేషన్ సంభవ్ పెద్ద విజయం

### డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** ఇటీవల మావోయిస్టుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అల్లూరి జిల్లా రంపచోడవరంలో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా పర్యటించారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా మావోయిస్టు ఏరివేత కొనసాగుతోందని డీజీపీ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఏవోబీ, రంపచోడవరం, మన్యం పరిసరాల్లో డీజీపీ ఏరియల్ సర్వే నిర్వహించారు. ఎన్‌కౌంటర్ తర్వాత ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల ఆయుధాలను పరిశీలించారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్లలో పోలీస్ బలగాలు విజయం సాధించాయని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. హిడ్మా, టెక్ శంకర్‌తో పాటు 13 మంది మావోయిస్టులు చనిపోయారన్నారు. అంతే కాకుండా 50 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు డీజీపీ తెలిపారు. జూన్‌లో ఎదురుకాల్పులు జరిగినప్పుడే మావోయిస్టులను లొంగిపోవాలని చెప్పినట్లు డీజీపీ వివరించారు. మార్చి 2026 నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. భద్రతా బలగాలు సాధించిన విజయానికి అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆపరేషన్ సంభవ్‌లో భాగంగా రెండు వరుస ఎన్‌కౌంటర్లలో అన్ని పోలీసు విభాగాలు సమర్థంగా పని చేశాయన్నారు. ఒకే ఒక బృందంగా మారి చాకచక్యంగా మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడం మెచ్చుకోదగ్గ విషయమని అన్నారు.

### తిరుపతిలో రాష్ట్రపతి ముర్ముకు


## ఘన స్వాగతం



**హైదరాబాద్, పతాకం న్యూస్:** రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల చేరుకున్నారు. శ్రీపద్మావతి విశ్రాంతి గృహం వద్ద ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు పనబాక (తరువాయి 2వ పేజీలో)

### తిరుమలలో కల్తీ నెయ్యి కేసు వైవీ సుబ్బారెడ్డిని

## ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం ఆరోపణలకు సంబంధించిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ ఛైర్మన్, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారులు విచారిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే ఈ విచారణ కొనసాగుతోంది. తొలుత ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని వైవీ సుబ్బారెడ్డికి సిట్ అధికారులు విజయవాడ నుంచి నోటీసులు జారీ చేశారు. అయితే, తాను అక్కడికి రాలేనని ఆయన సమాధానం ఇవ్వడంతో, సిట్ అధికారులే నేరుగా హైదరాబాద్ కు వచ్చి ఆయన ఇంట్లోనే ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో లడ్డూ తయారీకి నెయ్యి సరఫరా చేసిన సంస్థలు, వాటితో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఛైర్మన్ హోదాలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు వివరాలు రాబడుతున్నట్లు సమాచారం. ఇదే కేసులో ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) అప్పన్నను సిట్ అధికారులు అరెస్ట్ చేసి విచారించారు. ఆయన నుంచి పలు కీలక విషయాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఆ సమాచారం ఆధారంగానే ఇప్పుడు సుబ్బారెడ్డిని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విచారణ తర్వాత కేసులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని ఆసక్తి నెలకొంది.



## 10వ సారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్

2లో

## విశాఖ కార్ల షోరూంలో అగ్నిప్రమాదం.. 2 కార్లు పూర్తిగా దగ్ధం..

**హైదరాబాద్, పతాకం న్యూస్:** : విశాఖపట్నం మద్దిలపాలెంలోని ఓ కార్ల షోరూమ్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటల ధాటికి 2 కార్లు దగ్ధమయ్యాయి, మరో రెండు కార్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. నాలుగు ఫైరింజిన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలార్పారు. మద్దిలపాలెం నుంచి ఇసుకతోటకు వెళ్లే జాతీయ రహదారి సమీపంలో వంశీ ఫంక్షన్ హాల్ కింద ఈ కార్ల షోరూమ్ ఉంది. ఐదంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుదాఘాతం కారణంగా ఈ ప్రమాదం జరిగింది. విశాఖ ఇసుకతోటలో ఓ బహుళంతస్తులు భవనంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ భవనంలోని ఒక ప్రముఖ కార్ల షోరూమ్?లో మండల వ్యాపించాయి. ఉదయం 6 గంటల ప్రాంతంలో భవనం నుండి దట్టమైన పొగ రావడంతో స్థానికులు ,భవన వాచ్మెన్ అప్రమత్తమయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటా హుటిన సంఘటన ప్రాంతానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, సుమారు మూడు గంటల పైగా కష్టపడి మంటల్ని అదుపు చేశారు. 'సుమారు ఉదయం 7 గంటల సమయంలో సమాచారం అందింది. వెంటనే విశాఖపట్నం అగ్నిమాపక సిబ్బంది ప్రమాదం జరిగిన ప్రదేశానికి వచ్చారు. ప్రమాద తీవ్రత బట్టి ఇతర ఫైర్? స్టేషన్లకి సమాచారం ఇచ్చాం. సుమారు 7 అగ్నిమాపక వాహనాలను ఏర్పాటు చేశాం. పరిస్థితిని అదుపులోకి తీసుకున్నాం.' – రేణుకయ్య విశాఖ జిల్లా ఫైర్ అధికారి




మంటలు వ్యాపించిన భవనంలో కార్ల షోరూం ఉండటం కార్ల మరమ్మత్తు నిమిత్తం వినియోగించిన వ్యర్థ పదార్థాలు ఉండడం మంటలు వ్యాప్తికి దోహదపడ్డాయని అగ్నిమాపక శాఖ అధికారులు అంటున్నారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ఎన్‌కౌంటర్లు!

రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళ వారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ ఘటనలపై పోలీసులు ఎప్పుడూ వినిపించే ఎదురు కాల్పుల కథనాన్నే మరోసారి వినిపించారు. అదే సమయంలో అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పెట్టే అవకాశం ఉన్నప్పటికీ బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు.

అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే 'పనిపూర్తయింది' అని మీడియాలో వస్తున్న కథనాలతో ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు! భయోత్పాతం సృష్టించడమే లక్ష్యంగా జరిగే పోలీసు కనుసన్నల్లో జరిగే ఈ తరహా సంఘటనలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు! ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణం విడనాడాలి. తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే, ఆయనతో పాటు విజయవాడ, ఏలూరు, కాకినాడ తదితర ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. చట్టబద్ధంగా వారికున్న అన్ని హక్కులను వినియోగించుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత ఇప్పటివరకు 1,225 మంది మావోయిస్టులు లొంగిపోగా, 270 మంది పోలీసుల కాల్పుల్లో మరణించారు. మరో 680 మందికి పైగా అరెస్టు అయ్యారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. మరోవైపు గిరిజనులపైన, వారి నివాస ప్రాంతాల పైన సర్కారీ దాడి పెద్దఎత్తున చోటు చేసుకుంటోంది. కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయి. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నారు. వారితో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలనుసైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులపై పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరో రూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలు రూపుమాపడమే దీనికి పరిష్కారం. కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తడం మాని కేంద్ర ప్రభుత్వం ఈ దిశలోచర్యలు చేపట్టాలి. మాటల్లో కాకుండా గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. దేశ వ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు, ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. అదే విధంగా లొంగిపోయిన, అరెస్టయిన మావోయిస్టులు సాధారణ జీవితం గడపడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలి. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులపై పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. కాల్పుల ఘటనలపై న్యాయవిచారణ జరపాలన్న డిమాండ్ సరైనదే! అనుమానాల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవాలి.

## 10వ సారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్



**పాట్నా, పతాకం న్యూస్:** జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది. నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

## ఐ-బొమ్మ రవిని కస్టడీకి తీసుకున్న పోలీసులు.. బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ పీఎస్‌లో విచారణ



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. అతడిని బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పైరసీ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇమంది రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ కేసులో అతని నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సైబర్ క్రైమ్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి ఐదు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చారు. భారతీయ భాషల్లోని 21 వేల సినిమాలను పైరసీ చేసిన రవిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. కరేబియన్ దీవులు కేంద్రంగా చేసుకుని ఆరేళ్లుగా 66 మిర్రర్ వెబ్‌సైట్‌లలో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా, 50 లక్షల మంది డేటా సేకరించి సైబర్ నేరస్థులు, గేమింగ్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## పుస్తక పఠనానికి గ్రంథాలయాలే ఆలంబన

**సింహాచలం, పతాకం న్యూస్ :** స్మార్ట్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు జీవితానికి పెన వేసుకున్న ఈ ఆధునిక కాలంలో పుస్తక పఠనానికి గ్రంథాల యాలే ఆలంబనగా నిలుస్తున్నాయని సింహాచలం దేవస్థానం సహాయ కార్య నిర్వాహణాధికారి బి వి రమణమూర్తి అన్నారు. ఈనెల 14న ప్రారంభమైన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆడవివరం శాఖా గ్రంథాలయంలో గురువారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి రమణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భౌతికంగా పుస్తకాన్ని చదవడం వల్ల మెదడు ఉత్తేజం చెందడమే కాకుండా, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు.

## ప్రతి ధాన్యం బస్తా కొనుగోలు చేస్తాం: నాదెండ్ల

(మొదటిపేజీ తరువాయి)

ధాన్యాన్ని తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి వినతి చేస్తామన్నారు. రైతుకు మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వ సూచనల మేరకు ముందుకు వెళ్తామని, కూటమి ప్రభుత్వం రైతుల పక్షం ఉంటుందని ఆయన తెలిపారు. 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, బస్తా 1792 రూపాయలకు కొనుగోలు చేయనున్నామన్నారు. 20369, 20389 రకం దాన్యం రైతుల నుండి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, సివిల్ సప్లై ఎండి తులసి, తాడేపల్లి తహసిల్దార్ డి సీతారామయ్య, జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన ప్రాతూరు గ్రామ అధ్యక్షులు సంకురు విజయసాగర్, చిర్రావూరు గ్రామ జనసేన అధ్యక్షులు అంకం ఖాళీ కృష్ణ, పోకల బాపయ్య, కళ్ళం రాజశేఖర్ రెడ్డి,అంబటి తిరుపతిరావు,కొటేష బాబు, లాల్ చందు, కాసర గడ్డ శ్రీనివాసరావు, అరవపల్లి శ్రీనివాస్, రైతు భరోసా కేంద్రం అధికారులు, జనసేన పార్టీ ప్రాతూరు, చిర్రావూరు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో రాష్ట్రపతి ముర్ముకు ఘన స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్మి, జానకీదేవి, భానుప్రకాశెడ్డి, తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి.. రాష్ట్రపతికి స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. అంతకు ముందు రేణిగుంట విమానాశ్రయం నుంచి ద్రౌపది ముర్ము తిరుచానూరు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

## సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

### వైఎస్సార్సీపీ కార్యకర్తల హల్‌చల్



**నాంపల్లి, పతాకం న్యూస్:** అక్రమాస్తుల కేసులో వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. మరోవైపు వైఎస్సార్సీపీ నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే ఆగిపోయారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కావడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగించే పిటిషన్‌పై వాదనలకు సునీత హాజరయ్యారు. ఈ కేసులో నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్ రెడ్డి, శివశంకర్ రెడ్డి వాదనలు వినిపించారు. అదే సమయంలో అక్రమాస్తుల కేసులో జగన్ కోర్టుకు హాజరయ్యారు. ఒకరికొకరు ఎదురపడ్డా సునీతను చూసి కూడా జగన్? పలకరించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఒకే కుటుంబానికి చెందిన బాధితులు, నిందితులు ఒకేసారి కోర్టుకు హాజరయ్యారంటూ పలువురు అభిప్రాయపడ్డారు. జగన్ నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు హాజరుతో అక్కడికి చేరుకున్న వైఎస్సార్సీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. కోర్టు సమీపంలో రోడ్డుపై గుంపులుగా చేరి నినాదాలు చేశారు. '2029లో రప్పా రప్పా' అంటూ రాసి ఉన్న బ్యానర్లు ప్రదర్శించారు. వైఎస్సార్సీపీ శ్రేణుల హల్‌చల్‌తో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అంతకుముందు బేగంపేట ఎయిర్‌పోర్టు వద్దకు ఆయన చేరుకోవడంతో పెద్దఎత్తున వైఎస్సార్సీపీ కార్యకర్తలు అక్కడ హల్‌చల్ చేశారు. దీంతో బేగంపేటలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పలువురు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అంతకుముందు వైఎస్సార్సీపీ కార్యకర్తలు విమానాశ్రయంలోకి ప్రవేశించేందుకు ఒకేసారి యత్నించడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. సీబీఐ కోర్టు అనుమతితో గత నెల జగన్ యూరప్ పర్యటనకు వెళ్లారు. తిరిగి వచ్చాక కోర్టు ఎదుట హాజరుకావాలని న్యాయస్థానం షరతు విధించింది. యూరప్ నుంచి తిరిగి వచ్చిన జగన్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని లేదా ఆన్ లైన్? ద్వారా హాజరు అయ్యేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీబీఐ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమాస్తుల కేసులో జగన్ ఆరేళ్లుగా కోర్టుకు హాజరు కావడం లేదని సీబీఐ పీపీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసుల్లో డిశ్చార్జ్ పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున జగన్ హాజరు అయ్యేలా ఆదేశించాలని కోర్టును కోరారు. సీబీఐ వాదనను పరిగణలోకి తీసుకున్న సీబీఐ కోర్టు నవంబర్ 21వ తేదీ లోపు నేరుగా విచారణకు రావాలని ఆదేశించింది. దీంతో జగన్ గురువారం కోర్టుకు హాజరయ్యారు.

## సన్న బియ్యాన్ని పంపిణీ చేయండి: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## పంట కాలువలో చెత్తను తొలగించి రైతులను ఆదుకోండి



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి మండలం వట్టిగడ్డ రిజర్వాయర్ నుండి పంట పొలాలకు వచ్చే పంట కాలువ రాజవొమ్మంగి స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద నుండి 200 మీటర్ల పొడవునా స్థానికులు ఇష్టానుసారంగా చెత్త వేయడం వలన చెత్తాచెదారంతో నిండిపోయింది. రైతులు స్వచ్ఛందంగా ఆ చెత్తను తీసివేయడానికి కాలువలోకి దిగినా ఇంజక్షన్ సూదులు, గాజు పెంకులు గుచ్చుకోవడంతో పలు సందర్భాలలో గాయాల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు, పంట పొలాలకు వెళ్ళవలసిన సాగునీరు వెళ్లడం లేదని ఆయకట్టు రైతులు పోస్ట్ ఆఫీస్ వద్ద ఆందోళన తెలియజేశారు. వట్టిగడ్డ రిజర్వాయర్ నుండి వచ్చే ఈ పంట కాలువ ద్వారా 1500 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుందని, ఈ పూడిక వలన రైతులందరూ ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను స్థానిక సర్పంచి గొల్లపూడి రమణి దృష్టికి తీసుకు వెళ్లడంతో పోస్ట్ ఆఫీస్ ప్రదేశంలో ఆ చెత్తను తీయించి ఇకమీదట అక్కడ ఎలాంటి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాకవరపాలెం వద్ద డోజ్కో భారీ యూనిట్‌కు ప్రభుత్వం ఆమోదం



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ, భారీ ఎర్త్‌మూవింగ్ పరికరాలు మరియు విడిభాగాల తయారీ యూనిట్ స్థాపనకు ప్రముఖ సంస్థ డోజ్కో (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న ఈ యూనిట్‌కు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.1234 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో డోజ్కో సంస్థ ప్రతినిధులు ఎ జీఎం ఫైనాన్స్ చంద్రశేఖర్, ఏజీఎం రామారావు గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఈ యూనిట్ దోహదపడుతుందని, ముఖ్యంగా మాకవరపాలెం పరిశ్రమల హబ్‌గా మారుతుందని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అభిప్రాయపడ్డారు. ఈ పరిశ్రమ ద్వారా యువతకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్ పాల్గొన్నారు.

## బి.ఎన్ రోడ్డుపై కూరుకుపోయిన లారీ



**రోలుగుంట, పతాకం న్యూస్ :** బి.ఎన్.రోడ్డుపై ఒక లారీ రోడ్డు మధ్యలో కూరుకుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీని కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ ఘటనపై సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.గోవిందరావు, సిపిఎం నాయకులు పాంగి.చంద్రయ్య మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న ఎంపీలు,ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనివల్ల విశాఖ ఉమ్మడి జిల్లాలో ప్రయాణికులు ప్రతిరోజు గొయ్యిలో పడి ప్రమాదాలకు గురి అవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు గేమిల వాసు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**మల్కాపురం, పతాకం న్యూస్ :** గ్రంధాలయాలని విద్యార్థులందరు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు అన్నారు. 40వ వార్డు గాంధీగ్రామ్ శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంధాలయా ధికారి బి కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయం వారో త్సవాల ముగింపు కార్యక్రమం లో ముఖ్య అతిధిగా గుండపు నాగేశ్వరావు హాజయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు ఈ తరం విద్యార్థులను, యువతను గ్రంధాలయం లకు దగ్గర చేయడమే లక్ష్యంగా ఈ వారోత్సవాలను చేయడం అభినంయమన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం లో షిప్ యార్డ్ గుర్తింపు యూనియన్ కార్యదర్శి మూర్తి, పశువుల ఆసుపత్రి వైద్యధికారి డాక్టర్ సునీల్ కుమార్, వార్డు నాయకులు కమల్ నాయుడు, శ్యామ్ పాల్గొన్నారు.

## కొనలోవ గ్రామ సచివాలయానికి సందర్శించిన ఎంపీడీవో



**అడ్డతీగల, పతాకం న్యూస్:** అడ్డతీగల మండలం, కొనలోవ గ్రామ సచివాలయానికి ఎంపిడిఓ ఉదయం 10:30 గంటలకు సందర్శించడమైనది. సదరు సందర్శన సమయంలో ఎ ఎన్ ఎం మరియు అగ్రికల్చర్ అసిస్టెంట్ హాజరు కాలేదు. గ్రామ సచివాలయంలో నిర్వహించవలసిన 11 రిజిస్టర్లలో అటెండెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ మరియు సర్వీస్ చార్జెస్ రిజిస్టర్(3) మాత్రమే నిర్వహించుచున్నారు. పోస్టర్స్ కి సంబంధించి ఆధార్ పోస్టర్ డిస్ప్లే చేయలేదు. ప్రతి సచివాలయం సిబ్బంది ఉదయం బయోమెట్రిక్ అటెండెన్స్ వేసి, మూమెంట్ రిజిస్టర్ లో రాసి ఫీల్డ్ విజిట్ చేయవలెను. ఫీల్డ్ విజిట్ తదనంతరం కార్యాలయానికి వచ్చి అవుట్ టైం అటెండెన్స్ వేయవలెను. ప్రజల నుండి సచివాలయం సిబ్బంది పై ఏ రకమైన పిర్యాదులు రాకుండా చూసుకోవలసినదిగా తెలియజేయడమైనది. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం షెడ్ ను పరిశీలించడమైనది. అలాగే గ్రామం లో గల పారిశుధ్యం ఎలా ఉంది అని సచివాలయ సిబ్బంది తో ట్రాన్సిట్ వాక్ చేయడమైనది. తదనంతరం అంగన్వాడీ కేంద్రం సందర్శించి పిల్లలకు పెడుతున్న భోజనం మెనూ పరిశీలించడమైనది. ఎ ఎన్ ఎం సబ్-సెంటర్ సందర్శించి ప్రజలకు వైద్యం సకాలం లో అందుబాటులో ఉండాలని తెలియజేయడమైనది. మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శించి విద్యార్థులకు వండి పెడుతున్న భోజనాలు మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని పరిశీలించడమైనది.

## శ్రీ కనక మహాలక్ష్మీ అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ఘనంగా నిర్వహణ: ఈఓ శోభారాణి



**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** నగరంలోని వన్ టౌన్ బురుజుపేటలో కొలువై ఉన్న శ్రీ కనక మహాలక్ష్మీ అమ్మవారికి శ్రీ క్రోధినామ సంవత్సర మార్గశిర మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ అండ్ దేవస్థానం కార్యనిర్వహణాధి కారిణి కె.శోభారాణి తెలిపారు. బుధవారం దేవస్థానం ఆవరణలోని అన్న ప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ మార్గశిర మాసోత్సవాలను నవంబర్ 21వ తేదీ శుక్రవారం నుంచి, డిసెంబర్ 19వ తేదీ శుక్రవారం వరకు సాంప్రదాయ బద్ధంగా జరుపుతా మన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తయ్యా యన్నారు. డిసెంబర్ 7వ తేదీ ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటలకు వేద సభ అర్చక సదస్సును, డిసెంబర్ 13వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి రథ యాత్ర, డిసెంబర్ 18వ తేదీ గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదానం అదే రోజు సాయంత్రం 4 గంటలకు సహస్ర ఘటాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలు ఘనంగా జరుపుతా మన్నారు. ఈ కార్యక్రమాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా దానికి తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేశా మన్నారు. చలువ పందిళ్ళు వేయడంతో పాటుగా, భక్తులకు మంచి నీటి సదుపాయం కూడా కల్పిస్తున్నా మన్నారు. భక్తులు దేవస్థానం సిబ్బంది, మరియు వాలంటీర్లకు సహకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ మీడియా సమావేశంలో విశాఖ జిల్లా సమాచార శాఖాధికారి సదారావు, జిల్లా సహాయ సమాచార అధికారి నారాయణ రావు, దేవస్థానం సహాయ కార్యనిర్వహణా ధికారి రాజేంద్ర కుమార్, దేవస్థానం పురోహితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు జీవితాలకు కొత్త వెలుగులు బ్రెయిన్ డెడ్ అయిన రమేష్ నుంచి అవయవాల సేకరణ

**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** మరణించి కూడా ఐదుగురు జీవితాల్లో చిరంజీవిలా జీవిస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపాడతను. తన కుటుంబానికి తీవ్ర దుఃఖాన్ని నింపిన వ్యక్తి మరో అయిదు కుటుంబాలకు మాత్రం సంతోషాన్ని పంచారు.. ఆ కుటుంబం మగ దిక్కును కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ ఇతరుల కుటుంబాల్లో నూతన వెలుగులు నింపాలని అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చి అందరి చేత అభినందనలు పొందుతున్నారు... వివరాల్లోకి వెళితే విశాఖ లోని ఎండాడకు చెందిన బొబ్బిలి రమేష్ (51) తన ఇద్దరు పిల్లలు ,భార్యతో నివాసం ఉంటున్నాడు.. ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్న రమేష్ ఈనెల 10వ తేదీన తన నివాసం పైనుంచి ప్రమాదవశాత్తు కిందకు పడిపోయాడు. దీంతో తలలో తీవ్ర రక్తస్రావం జరగటంతో చికిత్స నిమిత్తం పలు ఆసుపత్రులను సందర్శించినప్పటికీ రక్తస్రావం నియంత్రణ లోకి రాలేదు. దీనితో ఈనెల 17వ తేదీన వెంకోజి పాలెం లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.. అతనిని రక్షించేందుకు ఆస్పత్రి వైద్య బృందం తీవ్రంగా శ్రమించారు.. అయినప్పటికీ ఆయన ఆరోగ్యం క్షీణించటంతో మంగళవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్య బృందం ప్రకటించారు.. వైద్య బృందం వారి కుటుంబ సభ్యులకు మరియు బంధువులకు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. వారు అంగీకారం తెలపటంతో ఈ సమాచారాన్ని జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆయన అవయవాలను స్వీకరించేందుకు అనుమతులను జారీ చేశారు.. అనంతరం బ్రెయిన్ డెడ్ అయిన రమేష్ నుంచి లీవర్, కిడ్నీలు మరియు కార్నియా స్వీకరించారు. జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ లిస్టును అనుసరించి అవయవాలను పలు ఆసుపత్రులకు కేటాయించారు. ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక ప్రజలు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. అవయవదానానికి ప్రోత్సహించిన వైద్య బృందానికి.. ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులకు డాక్టర్ రాంబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు..

## వీఆర్ఏల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

**గొలుగొండ, పతాకం న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం గొలుగొండ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించండం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 20 వేల మంది వీఆర్ఏలు రెవిన్యూ శాఖలో పనిచేస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదని, గతంలో ప్రకటించిన డిఏని కూడా వెనక్కి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న నామినీ వీఆర్ఏలను శాశ్వతం చేయకపోవడం, అక్రమంగా అదనపు విధులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. వీఆర్ఏలకు అదనపు భారాల నుంచి మినహాయింపు ఇవ్వాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

## రాంబిల్లిలో రిలయన్స్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లాలో మరో పెద్ద పారిశ్రామిక సంస్థ పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసింది. దీని ద్వారా 300 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. ముఖేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) సంస్థ మూడేళ్ల క్రితం రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌ను ఏర్పాటుచేసింది. రిటైల్ వెంచర్స్‌లో భాగమైన ఈ కంపెనీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టిసారించింది. అనకాపల్లి జిల్లాలో సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్‌లు, ప్యాకేజింగ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించింది. ఈ నెల మొదటి వారంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ కమిటీకి దరఖాస్తు చేయగా, మూడు రోజుల్లోనే దానిని పరిశీలించి పెట్టుబడుల ప్రమోషన్ బోర్డుకు సిఫారసు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రాంబిల్లి మండలంలోని కృష్ణంపాలెంలో 30 ఎకరాలను కేటాయించింది. ఎకరా రూ.40 లక్షలు చొప్పున ఇచ్చింది. ఈ పరిశ్రమపై రూ.784 కోట్లు వెచ్చించనున్నట్టు రిలయన్స్ గ్రూపు వెల్లడించింది. వీరికి రాష్ట్ర ప్రభుత్వం టైలర్ మేడ్ రాయితీలు ప్రకటించింది. రాష్ట్రానికి చెల్లించే జీఎస్టీని 100 శాతం రీఎంబర్స్‌మెంట్ చేసుకోవచ్చు. ఇలా ఐదేళ్లు జీఎస్టీ వెనక్కి వెళ్లిపోతుంది. దీని అంచనా విలువ రూ.249.82 కోట్లు. ఉపయోగించుకునే విద్యుత్‌కు యూనిట్‌కు రూపాయి చొప్పున ఐదేళ్లు రాయితీ ఇస్తారు. దీని ద్వారా రూ.27.60 కోట్లు లబ్ధి చేకూరుతుంది. ఎలక్ట్రిసిటీ డ్యూటీ మినహాయింపు యూనిట్‌కు రూపాయి చొప్పున ప్రకటించారు. ఐదేళ్లకు దీని ద్వారా మరో రూ.27.6 కోట్ల ప్రయోజనం కలుగుతుంది. ఈ రాయితీల ద్వారా సుమారు రూ.330 కోట్లు సంస్థకు వెనక్కి వెళుతుంది. కేటాయించిన భూమిలో ఏమైనా మౌలిక వసతులు కావాలని సంస్థ కోరితే...వాటికి ఎంత ఖర్చు అయితే అంత వారే చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన విధించారు. ప్రకటించిన రాయితీలు కొన్ని పాలసీలో లేకపోయినా పెద్ద పరిశ్రమ కావడంతో ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నారు.

## శానిటరీ సిబ్బందికి దుస్తులు పంపిణీ



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** విశాఖ పశ్చిమ నియోజకవర్గం 59 వ వార్డు శానిటరీ సిబ్బందికి జీవీఎంసీ నిధులతో బట్టలు పంపిణీ కార్యక్రమం స్థానిక జనసేన నాయకులు మరియు 59 వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బట్టలు పంపిణీ కార్యక్రమం చేస్తున్నామని, అందరూ నిబద్ధతతో పనిచేసే జీవీఎంసీకి మంచి పేరు తేవాలని, అలాగే సిబ్బంది తక్కువ ఉన్న దృష్ట్యా ఈ సమస్యను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మరియు జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలో సానిటరీసిబ్బంది నియమిస్తారని, ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక 59 వార్డు అధ్యక్షులు. ఊరుకుటి హరి,క్లస్టర్ ఇంచార్జి డొంకనా రాంబాబు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్ మోహన్ నాయుడు,బీజేపీ నాయకులు రామకృష్ణ, పార్టీ నాయకులు, సానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే చట్టాలపై విద్యార్థినులకు అవగాహన ఉండాలి: రూరల్ సీఐ రేవతమ్మ





**గొలుగొండ, పతాకం న్యూస్ :** అనకాపల్లి జిల్లా గొలుగొండలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం మరియు వొకేషనల్ జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థినులకు చట్టపరమైన అవగాహన కార్యక్రమాన్ని నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మ,గొలుగొండ సబ్-ఇన్‌స్పెక్టర్ పి.రామారావు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలు,ఇటీవల అమలులోకి వచ్చిన కొత్త నేర నియంత్రణ చట్టాలు,పోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యత,బాల్య వివాహాలు వల్ల కలిగే శారీరక-మానసిక హాని,వాటిని నిరోధించే చట్టపరమైన మార్గాలు తదితర అంశాలపై విద్యార్థినులకు సుబోధగా వివరించారు. అంతేకాదు ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా తక్షణమే 100 డయల్ చేయడం,సమీప పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడం,మహిళా పోలీసు అధికారుల సహాయం తీసుకోవడం వంటి ప్రాక్టికల్ సలహాలు ఇచ్చి, పోలీసులు మీ స్నేహితులే అని నమ్మకం కల్పించారు. విద్యార్థినులు ఈ అవగాహన కార్యక్రమానికి ఉత్సాహంగా స్పందించడంతో పాటు, తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి స్పష్టత పొందారు. పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉపయోగకరంగా నిర్వహించిన పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నిముషానికి 30 మంది కౌలురైతుల ఆత్మహత్య



**పల్నాడు జిల్లా, పతాకం న్యూస్:** వ్యవసాయంలో 70 శాతం భూముల్ని సాగు చేస్తున్న కౌలురైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులో ముత్తవరపు సురేష్ కర్షక సదన్‌లో బొల్లు శంకరరావు నగర్‌లో కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా 4వ మహాసభ జరిగింది. సభా ప్రాంగణంలో జెండాను సీనియర్ నాయకులు కొమ్మినేని నాగేశ్వరరావు ఎగురవేశారు. పోపూరి రామారావు, బొల్లు శంకరరావు చిత్రపటాలకు నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన హరిబాబు మాట్లాడుతూ వ్యవసాయంలో వస్తున్న నష్టాల వల్ల అప్పులపాలైన కౌలురైతులు ప్రతి నిముషానికి 30 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, వీరి కుటుంబాలకు కనీసం పరిహారమైనా ప్రభుత్వాలు ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. వ్యవసాయం గిట్టుబాటవ్వక చాలా కుటుంబాలు వ్యవసాయాన్ని వదిలేస్తున్నాయని, మరోవైపు అక్రమ సంపాదనతో రాజకీయాల్లోకి వచ్చిన వారు దేశాన్ని దోచుకోవడంతోపాటు వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గిన పాలకులు మొక్కజొన్న, సోయా పంటలతోపాటు పాల ఉత్పత్తులనూ సుంకాలు లేకుండా దిగుమతికి అనుమతించారని విమర్శించారు. ఆమెరికాకు మన రైతులను బలిపెడుతున్నారని, రైతులకు రక్షణ కరువైందని, కౌలురైతుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని అన్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ పరిరక్షణ కోసం రైతులు, కౌలురైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయంలో అత్యధిక భాగాన్ని మోస్తున్న కౌలురైతులు రుణభారంతో అవస్థ పడుతున్నారని, గుర్తింపు కార్డులు లేని కారణంగా రుణాలు, అన్నదాత సుఖీభవ, ఇతర రాయితీలు వారికి దక్కడం లేదని చెప్పారు. భూయజమానితో నిమిత్తం లేకుండా కౌల్దార్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధరలు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు విజరుకుమార్, కౌలురైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, కార్యదర్శి జి.రవిబాబు సౌహార్ద సందేశాలిచ్చారు. అన్నదాత సుఖీభవనను కౌలురైతులకూ వర్తింపజే యాలని, ఒకేసారి రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని జమ చేయాలని, కౌలుచట్టంలో మార్పులు తెచ్చి కౌలురైతుల ందరికీ గురింపు కార్డులు ఇవ్వాలని, మొంథా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు సత్వరం పరిహారం ఇవ్వాలని, సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో 20 శాతం వరకు తేమశాతాన్ని అనుమతించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఆమోదిచింది.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ప్రభుత్వం అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుంది. విజయవాడ స్వరాజ్యమైదానంలో 404 కోట్ల వ్యయంతో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ స్మృతి వనం నిర్లక్ష్యం చేస్తుందని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహార్ కు గురువారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గత 18 నెలలుగా రాష్ట్రంలో అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం ద్వారా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు కావడం లేదని, ఎస్సీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై వేధింపులు జరుగుతున్నాయని కమిషన్ దృష్టికి తీసుకు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో దారాల వెంకటేష్ లోపింటిర్ రామకృష్ణ, నిమ్మకాయల శంకరమ్మ, పట్టా కనకరాజు, బండి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మృతదేహం లభ్యం



**శ్రీకాకుళం , పతాకం న్యూస్:** నౌపడ గ్రామ శివారులో రక్తపు మడుగులో గురువారం మధ్యాహ్నం మహిళ మృతదేహం లభ్యం అయింది. అనుమానాస్పదంగా ఉన్న మృతదేహాన్ని చూసి గ్రామస్తుల ఆందోళన చెందుతున్నారు. దీనిపైన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ ప్రారంభించారు.

## ఫార్మాసిటీలో మత్స్యకారులకు తక్షణమే ఉపాధి కల్పించాలి




**పరవాడ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో జాలా రిపేట, దిబ్బపాలెం, ముత్యాలమ్మపాలెం, సమ్మంగిపాలెం చెందిన ఫార్మసిటీ బాధిత మత్స్యకారులు గురువారం ముత్యాలమ్మపాలెం లో సమావేశం నిర్వహించారు. ఫార్మాసిటీ, రామ్ కి సంస్థలు విడిచి పెడుతున్న వ్యర్థ రసాయనాలు నేరుగా సముద్రంలోకి రావడం వలన తరుచూ మత్స్య సంపద మృత్యువాత పడుతుంది. తద్వారా మత్స్యకారులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినప్పటికీ ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు రామ్ కి నుండి రావలసిన ఉద్యోగ ఉపాధి ప్యాకేజీ ఇవ్వకపోవడం చాలా అన్యాయమన్నారు . కావున తక్షణమే ఫార్మాసిటీ, రామ్ కి యాజమాన్యాలు స్పందించి మత్స్యకారులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించడానికి ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. లేని ఎడల మలి దశ ఉద్యమానికి, ఫార్మాసిటీ ముట్టడికి మత్స్యకారులు అంతా సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నాము. మత్స్యకారులు చేసే ఉద్యమానికి కూటమి పార్టీ నాయకులు, ఫార్మాసిటీ నిర్వాసితులు, పత్రికా సోదరులు, ప్రజాస్వామ్య వాదులు, మద్దతు ఇవ్వవలసిందిగా కోరుచున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాలముపాలెం సర్పంచ్, ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర మత్స్యకార సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, చింతకాయల సుజాత ముత్యాలు, ఎంపిటిసిలు అర్జిల్లి దేవిరవి మైలపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## రూ.కోట్లలో బిల్లులు పెండింగ్

### కాంట్రాక్టర్లకు తప్పని ఎదురుచూపు



**శ్రీకాకుళం జిల్లా, పతాకం న్యూస్:** జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు అందరూ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టినా పనులకు నేటికీ బిల్లులు అందకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరి సంవత్సరం నుంచి కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల కాలంలో చేసిన పనులకు గాను ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. పైగా కొత్త అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తూ కాంట్రాక్టర్లతో బలవంతంగా పనులు చేయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. వాటి కోసం ప్రతిరోజూ కాంట్రాక్టర్లు ఇంజనీరింగ్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎంఎస్ఎఫ్ ద్వారా బిల్లులు ఇచ్చేవారు. అయితే చివరి ఏడాది చేపట్టిన పనులకు సంబంధించి రూ.కోట్లలో బకాయిలు ఉండిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బకాయిలు ఉన్న విషయాన్ని గుర్తించి, వాటిని దపదపాలుగా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల కిందట ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షల వరకూ బకాయిలు చెల్లించింది. కూటమి ప్రభుత్వం సీఎంఎస్ఎఫ్ ఖాతాలను పూర్తిగా రద్దు చేసి, కొత్త ఖాతాల ద్వారా నగదు చెల్లించడానికి రంగం సిద్ధం చేసింది. మొత్తం అన్నిరంగాల్లో ఉన్న ప్రభుత్వ శాఖలను ఒకే ఖాతాకిందకు తీసుకువచ్చింది. గ్రేడింగులను విభజించి పోర్టరులో నమోదైన మేరకు వరుస క్రమంలో బిల్లులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇది జాప్యం జరుగుతుండడంతో గత 16 నెలల కాలంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేకపోతుంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో చేపట్టిన పనులన్నింటికీ బిల్లు బకాయిలు ఉన్నాయి. ఒక్క పలాస-కాశీబుగ్గలోనే రూ.2 కోట్ల మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయి. దీంతో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఇష్టపడడం లేదు. ఉన్న బిల్లులకే దిక్కులేదు, కొత్త పనులు ఏ విధంగా చేపట్టగలమని అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే, కాంట్రాక్టర్లతో బలవంతంగా పనులు చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై పలాస-కాశీబుగ్గ డీఈఈ కనకరాజును వివరణ కోరగా.. 'మొత్తం బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. పోర్టర్‌లో నమోదు చేసిన మేరకు వరుస క్రమంలో బిల్లు బకాయలు నేరుగా కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి బిల్లులు వేస్తామని ప్రభుత్వం తెలిపింది. వచ్చే నెల డిసెంబరులో కొంతమేరకు ఖాతాల్లో పడే అవకాశం ఉంది.' అని తెలిపారు.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా పరిశుభ్ర పచ్చని పంచాయతీల దిశగా శిక్షణా కార్యక్రమం



**కొయ్యూరు, పతాకం న్యూస్ :** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నాడు సుస్థిర భివృద్ధి లక్ష్యాల సాధనలో కీలకమైన పరిశుభ్ర పచ్చని పంచాయతీల నిర్మాణానికి సంబంధించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు,విఓఎలు పాల్గొన్నారు.మండల ఎంపీడీవో మరియు డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో కార్యక్రమం సజావుగా కొనసాగింది.గ్రామాలలో చెత్త నిర్వహణ,పారిశుధ్యం మరియు ప్రజారోగ్య పరిరక్షణ విషయాల్లో అవగాహన పెంచేందుకు ఈ శిక్షణ ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడింది.చెత్త తయారీ దశ నుంచి సంపద సృష్టి వరకు ప్రతి దశలో కీలకమైన తడి,పొడి చెత్త వేరుచేయడం అత్యంత ప్రధానమని ఎంపీడీవో గారు ఈ సందర్భంగా చెప్పారు. చెత్తను వర్గీకరించి స్వచ్ఛ రాయబారి/క్లాప్ మిత్రాలకు అందజేస్తే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడడమే కాకుండా ప్రజారోగ్యం కూడా బాగుంటుందని ఆయన పేర్కొన్నారు.తదుపరి ప్రధాన శిక్షకులు బాబురావు మరియు కె.టి.నాయుడు శిక్షణార్థులను ఉద్దేశించి పలు కీలక సూచనలు,మార్గదర్శకాలు వివరించారు.పర్యావరణ పరిరక్షణ,చెత్త నిర్వహణలో కొత్త విధానాలు, గ్రామస్థాయి ఆరోగ్య భద్రత వంటి అంశాలపై వారు అవగాహన కల్పించారు.

## కేంద్రంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఫైర్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. కోర్టు తీర్పులను పక్కనబెట్టే అధికారం పార్లమెంట్ కు లేదని పేర్కొంది. ఈమేరకు 2021 లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ ట్రైబ్యునల్‌తో పాటు పలు ట్రైబ్యునళ్లు రద్దయ్యాయని మద్రాస్ బార్ అసోసియేషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టం అమలును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో న్యాయస్థానం కొట్టివేసిన చట్టాలకు.. వాటి నిబంధనల్లో స్వల్ప మార్పులు చేసి కొత్త చట్టాలు తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కోరగా.. సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు ప్రాధాన్యతను బట్టి అవసరమైతే తామే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తామని చెప్పారు. దీంతో ప్రభుత్వ న్యాయవాది విచారణకు వాయిదా కోరగా సీజేఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ పొందే వరకూ ఈ కేసులో తీర్పు రావద్దని కోరుకుంటున్నారా?' అంటూ ప్రభుత్వ న్యాయవాదిని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం కోర్టు తీర్పులను ఉల్లంఘించడం సరికాదని పేర్కొంటూ.. ట్రైబ్యునళ్ల సంస్కరణ 2021 చట్టంలోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీర్పు వెలువరించారు.

## ఘనంగా ముగిసిన గ్రంధాలయ వారోత్సవములు



**చోడవరం, పతాకం న్యూస్ :** 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవముల ముగింపు సమావేశం గురువారం జరిగింది. చోడవరం శాఖా గ్రంధాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధులుగా ఎంఇవో -1 పాండురంగారావు, ఎంఇవో -2 సింహాచలం , గర్ల్స్ హైస్కూల్ హెడ్మాస్టర్ రామిరెడ్డి హాజరైరి. వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించడమైనది. ఇంకా ఈ కార్యక్రమంలో టివి రమణ మాస్టారు, గౌరీశంకర్ మాస్టారు, పి. రాజశేఖర్, రిటైర్డ్ లెక్చరర్, రామయ్యరెడ్డి, జ్యోతిరావు పూలే స్కూల్ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు హాజరుఅయితిరి. గ్రంధాలయములు ఉపయోగించుకొని ఎంతోమంది ఉన్నత స్థితికి చేరుకొన్న విషయం, గ్రంధాలయముల ఆవశ్యకత గురించి అతిధులు తెలియజేసితిరి. ఇంచార్జి లైబ్రేరియన్ శ్రీమతి యమ్ ఎస్ ఎల్ జోగేశ్వరి వందన సమర్పణతో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవములు ముగియడమైనది.

## 'శీతల పండుగ'ను ఘనంగా జరుపుకున్న అడపవలస గిరిజనులు

**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** గిరిజనుల సంప్రదాయ పండుగ "శీతల"ను మండల కేంద్రంలోని సాగర పంచాయతీ, అడపవలస గ్రామానికి చెందిన గెమ్మెలి రామన్న ఇంట వైభవంగా నిర్వహించారు. తాజాగా పండిన వరి పంటను నూర్పు చేసి, కొత్త ధాన్యాన్ని కలంలో వేసి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులందరినీ ఆహ్వానించి కుటుంబ సమేతంగా రుచికరమైన గిరిజన వన భోజనం చేసుకున్నారు.గిరిజన సంస్కృతి, సోదరభావం, సంప్రదాయ వంటకాలతో నిండిన ఈ శీతల పండుగ వేడుక గ్రామంలో ఆనందోత్సవ వాతావరణాన్ని నింపింది.ఈ కార్యక్రమానికి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామర్ల సూర్యనారాయణ, జి. రాంప్రసాద్ మాస్టారు, గ్రామస్తులు, బంధు మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# మార్చి నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తాం



**పల్నాడు జిల్లా, పతాకం న్యూస్:** వచ్చే ఏడాది మార్చి నాటికి టిడ్కో ఇళ్లను పూర్తిచేసి పెద్ద కార్యక్రమం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందిస్తా మని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 2014-19లో అప్పటి టిడిపి ప్రభుత్వం పిడుగురాళ్ల పట్టణంలో 6 వేల ఇళ్లు మంజూరు చేసి 2832 ఇళ్ల నిర్మాణం చేపట్టిందని, 1236 గృహాల నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. 365 అడుగుల గృహానికి కేంద్ర ప్రభుత్వం రూ.లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండున్నర లక్షలు సబ్సిడీ ఇస్తాయని, మిగతా మొత్తాన్ని లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుందని తెలిపారు. 300 అడుగుల గృహాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదున్నర లక్షలు సబ్సిడీ అందిస్తుందని లబ్ధిదారుడు ఏమి చెల్లించనవసరం లేదని తెలిపారు. గురజాల నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త స్కీం ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటిని పంపించేందుకు స్కీమ్ ఏర్పాటు చేసిందని, ఆ స్కీంను టిడ్కో గృహాలు కూడా సరఫరా చేపిస్తామని తెలిపారు. నీటి సరఫరా, డ్రెయినేజీ, సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, పార్కులు మొత్తం ఏర్పాటు చేస్తామని చెప్పారు. పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ చిన్న సుబ్బారావు, కమిషనర్ శ్రీనివాసరావు, టిడ్కో ఏఈ పద్మ పాల్గొన్నారు.

# తగ్గిన మద్యం ఆదాయం



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ఖజానాకు మద్యం ద్వారా వచ్చే ఆదాయం తగ్గుతోంది. ఈ ఏడాది మద్యం ఆదాయం అక్టోబర్లో 56 శాతం తగ్గినట్లు తేలింది. గత ఏడాది అక్టోబర్లో రు.4,409 కోట్లు రాగా, ఈ అక్టోబర్లో కేవలం రు. 1,956 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలల్లో రు. 16,288 కోట్లు రాగా, ఈ ఏడాది అదే ఏడు నెలల్లో రు. 15,275 కోట్లు ఖజనాకు చేరాయి. అంటే, అంటే ఆరు శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. ఇలా భారీగా ఆదాయం తగ్గడానికి గల కారణాలను కూడా అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇక మొత్తం ఆదాయం కూడా ఆందోళన కలిగించేదిగానే కనిపిస్తోంది. గతేడాది అక్టోబర్ వరకు రు. 57,528 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్ వరకు కేవలం మూడు శాతం వృద్ధితో రు. 57,392 కోట్లు వచ్చింది. అయితే ఒక్క అక్టోబర్ నెల గణాంకాలు పరిశీలిస్తే 20 శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. గత ఏడాది అక్టోబర్లో రు. 10,235 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్ లో రు. 8,203 కోట్లు మాత్రమే రావడం విశేషం. మిగిలిన ఆదాయ విభాగాలను పరిశీలిస్తే వాణిజ్య పన్నుల విభాగంలో గతేడాది కన్నా కేవలం నాలుగు శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. వాహనాల పన్నుద్వారా కూడా నాలుగు శాతమే వృద్ధి కనిపించింది. అటవీశాఖ ఆదాయంలో 22 శాతం మైనస్ వృద్ధి నెలకొనగా, ఇతర పన్నుల్లో 44 శాతం, పన్నేతర ఆదాయంలో 14 శాతం మైనస్ వృద్ధి నమోదైంది. అయితే గనుల శాఖలో 39 శాతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లలో 32 శాతం అధిక వృద్ధి నమోదు కావడం కొంతవరకు ఊరటనిస్తోంది. అయితే ఈ రెండు విభాగాల్లో వృద్ధి ఎక్కువగా ఉన్నప్పటికీ మొత్తం ఆదాయం చెప్పుకోదగ్గదిగా లేకపోవడం, చిన్న మొత్తం మాత్రమే కావడంతో ఆర్థికశాఖ కూడా పెద్దగా పట్టించుకోవడంలేదు.

# భారతీయులు నెలకు సగటున ఎంత జీబీ డేటా వాడుతున్నారో తెలుసా?.. ప్రపంచంలో మనమే టాప్!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మొబైల్ డేటా వినియోగంలో భారతీయులు ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచారు. దేశంలోని ఒక్కో స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు నెలకు సగటున 36 జీబీ డేటాను వాడుతున్నట్లు ప్రముఖ టెలికాం సంస్థ ఎరిక్సన్ తన మొబిలిటీ రిపోర్ట్‌లో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఇదే అత్యధిక సగటు వినియోగం కావడం గమనార్హం.

ఎరిక్సన్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం 36 జీబీగా ఉన్న ఈ సగటు వినియోగం 2031 నాటికి నెలకు 65 జీబీకి చేరుకుంటుందని అంచనా వేశారు. భారత్‌లో 5జీ సేవలు శరవేగంగా విస్తరిస్తుండటంతో డేటా వాడకం మరింత పెరగనుంది. 2025 చివరి నాటికి దేశంలో 5జీ సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య సుమారు 39.4 కోట్లకు చేరుతుందని, ఇది మొత్తం మొబైల్ కనెక్షన్లలో 32 శాతంగా ఉంటుందని రిపోర్ట్ పేర్కొంది.

భవిష్యత్తులో 5జీ వినియోగదారుల సంఖ్య మరింత పెరగనుంది. 2031 నాటికి భారత్‌లో 5జీ యూజర్ల సంఖ్య 100 కోట్లు దాటుతుందని, ఇది మొత్తం మొబైల్ వినియోగదారులలో 79 శాతానికి సమానమని నివేదిక అంచనా వేసింది. ఇది దేశంలో డిజిటల్ సేవలు, కనెక్టివిటీ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయో స్పష్టం చేస్తోంది.

# బలిపీఠంపై కార్మికుల భవితవ్యం!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కార్మిక మంత్రిత్వశాఖ ఇకనుండి యాజమాన్యాల మంత్రిత్వశాఖగా మారబోతున్నదా! యాజమాన్యాల రక్త దాహానికి రహదారులను ప్రభుత్వమే సిద్ధం చేస్తున్నదా! మోడీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను చూస్తుంటే అవుననే చెప్పుకోవాల్సి వుంటుంది. 29 కార్మిక చట్టాలను చుట్ట గట్టి, చూరు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించి కార్మికుల నరాలన్నింటినీ ఎలా బిగించాలో పార్లమెంట్ సాక్షిగా సిద్ధం చేశారు. వాటి అమలుకు ఆదేశాలు ఇంకా వెలువడక ముందే అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, అనేకానేక కంపెనీలు ఆ నాలుగు లేబర్ కోడ్‌లలో ఉన్న వాటికన్నా ఎక్కువ నిర్బంధాలతో పని గంటలు పెంచి, రాత్రింబవళ్లు తేడా లేకుండా ఉద్యోగులను రాచి రంపాన పెడుతూ, మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా అన్ని వేళల్లోనూ పని చేయించుకుంటూ ఇష్టానుసారంగా రంపపు కోత సాగుతున్నది. ఈలోపునే 'శ్రమశక్తి నీతి 2025' పేరున కేంద్ర కార్మిక శాఖ కార్మిక చట్టాల స్వరూపాన్ని పూర్తిగా మార్చివేసి, దానిపై స్పందన తెలియజేయ వలసిందిగా ప్రజలను ప్రభుత్వం కోరుతున్నది. ప్రభుత్వాన్ని అడగవలసిన మొత్తం మొదటి ప్రశ్న-కార్మికులను ప్రభావితం చేసే అంశాలపై ప్రజలు స్పందించగలుగుతారా లేదా కార్మిక సంఘాలు, కార్మికులు స్పందిస్తారా? దీన్నిబట్టి కార్మిక సంఘాల పట్ల, కార్మికుల పట్ల ఈ పెద్దలకు ఎంత నిర్లక్ష్య భావన ఉన్నదో స్పష్టమవుతున్నది. ఈ శ్రమశక్తి నీతి విధానాన్ని రూపొందించడానికి కౌటిల్యుని అర్థశాస్త్రం, మనుస్మృతి, యజ్ఞవల్క్య స్మృతి, నారద స్మృతి, శుక్ర నీతి వంటి వాటిని ప్రాతిపదికగా చేసుకుని రచించామని ప్రకటించారు. వారెవా! మన సాంప్రదాయాలను, మన నమ్మకాలను ఉటంకిస్తూ మన వేలితో మన కన్నునే నేరుగా పొడుచుకోవడానికి ఎంతటి కుయుక్తులతో సిద్ధమవుతున్నారో చూడండి! ఇలాంటి స్మృతులను ఉటంకించి భవిష్యత్తులో చట్టాలకు బదులు సాంప్రదాయ వాదంలో సమాధానాలు వెతుక్కోమని చెప్పడానికి మార్గం సుగమం చేసుకుంటున్నారన్నమాట! "వ్యాపారం ద్రోహ చింతనం" (వ్యాపారం చేయడం మోస ప్రవృత్తికి అవకాశం ఇస్తోందని చెప్పిన కౌటిల్యుని మాటలకు ఏ మాత్రం విలువ ఇవ్వరు కానీ, "లాభార్థి సర్వకార్య సాగుణ నీతి" (లాభాన్ని ఆశించేవాడు చేసే పనిలో అన్ని కార్యాలు సరైనవే) అనే అంశాన్ని మాత్రం యాజమాన్యానికి అనుకూలంగా అన్వయింపజూస్తున్నారు. ఇంకో రకంగా చెప్పాలంటే భవిష్యత్తులో కార్మిక చట్టాలేవీ న్యాయ సమ్మతమైనవి కాకుండా చేయడానికి ఇవీ నాంది. కోర్టులో కూడా సవాల్ చేయడానికి వీలులేని విధంగా ఈ విధానాలను రూపొందిస్తున్నట్లు మనకు స్పష్టంగా అర్థమవుతోంది. కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కనీస సభ్యుల సంఖ్యను అమాంతం పెంచివేయడం, నిరసనలు ధర్నాలు నిర్వహించడానికి అనుమతులను తప్పనిసరి చేయడం, సదరు నిరసనలు సమ్మెలు చేయడానికి కంపెనీ లేదా సంస్థ కార్యాలయానికి కనీసం రెండు కిలోమీటర్ల దూరాన్ని పాటించాలని షరతు విధించడం, పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారాన్ని యాజమాన్యాల ఇష్టానుసారానికి వదిలివేయడం, కలిసికట్టుగా తెలిపే నిరసనను నేరపూరితంగా పరిగణించడం వంటివి ప్రతిపాదిత నాలుగు లేబర్ కోడ్‌లలో పొందుపరిచినప్పుడే కార్మికుల, కార్మిక సంఘాల అస్తిత్వానికి చరమగీతం పాడారు. ఇప్పుడు కార్మికులు ఇవన్నీ పాటించినప్పటికీ 'శ్రమశక్తి నీతి' పేరు మీద యాజమాన్యాలు ఎలాంటి కక్షపూరిత చర్యలకు పాల్పడినా ప్రభుత్వాలు ఏమీ పట్టించుకోవు. పైగా సూచనప్రాయ సలహా మాత్రమే ఇస్తాయి. పైపెచ్చు 'కోఆపరేటివ్ ఫెడరలిజం' అనే పేరును ఉటంకించి కార్మికులు యాజమాన్యాలు కలిసి మాట్లాడుకోవాలి తప్ప, పోరుబాట పట్టరాదన్నారు. ఇంకా చెప్పాలంటే యాజమాన్యాలకు సహకరిస్తూ, కావాల్సిన పరిహారాన్ని అర్థించాలి తప్ప డిమాండ్ చేసి బాధ పెట్టకూడదట. ఇలాంటి వాటిని కార్మిక చట్టాలంటారా? యాజమాన్య చట్టాలంటారా? కార్మిక చట్టాల అమలుకు బాధ్యత వహించాల్సిన కేంద్రం కేవలం అవి అమలు జరిగేందుకు తోడ్పాటును అందిస్తుందట. అంటే ఇకనుండి యాజమాన్యాలు కార్మిక చట్టాలను పాటించకపోయినా అమలు చేయకపోయినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన ఉండదు. ఒకవేళ కార్మికులెవరైనా తమ దృష్టికి తీసుకువస్తే ఇరు పక్షాలకు సూచనలు చేస్తుంది. ఇలాంటి పరిస్థితి ఇప్పుడు కొనసాగుతూనే ఉన్నది. అనేక కంపెనీలు ప్రావిడెంట్ ఫండ్ చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన కేంద్రం కేవలం సూచనప్రాయంగా కూడా మందలించడం లేదు. కార్మికులు, కార్మిక సంఘాలు కోర్టుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితాల సున్నా. పి.ఎఫ్ డిపార్ట్‌మెంట్లు ఏమీ చేయలేని అసహాయతలో ఉన్నాయి. ఇకనుండీ ఇది అధికారికంగా యాజమాన్యాలకు లభించే హక్కుగా మారబోతున్నది. కాంట్రాక్ట్ ఎంప్లాయిమెంట్ కల్పించే కాంట్రాక్టర్, వర్కర్లకు కాంట్రాక్ట్‌లోని అన్ని సదుపాయాలను కల్పించకపోతే, వర్కర్ల సేవలు పొందే ప్రిన్సిపల్ ఎంప్లాయర్ బాధ్యత వహించాలని కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్స్‌డ్ ఎంప్లాయిమెంట్ చట్టంలో ఉండేది. లేబర్‌కోడ్ లలో దీన్ని పూర్తిగా తొలగించారు. ఇప్పుడు కాంట్రాక్టర్ బాధ్యత కూడా చట్ట పరిధి నుంచి తొలగిపోతున్నది. వర్కర్లను ఇష్టారీతిన తొలగించడానికి అనేక కారణాలతో పాటు మార్కెట్లో చౌకగా లభించే వర్కర్లు ఉన్నారని చూపించడానికి కూడా వెసులుబాటు కల్పిస్తున్నారు. గతంలో కంపెనీలలో కార్మికులకు సంబంధిత అంశాలను పరిశీలించడానికి ఇన్‌స్పెక్టర్‌ను నియమించేది. ఇప్పుడు దాని పేరు ఫెసిలిటేటర్‌గా మార్చుకున్నారు. ప్రస్తుతం ఉన్న లేబర్ పాలసీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంట్‌లో, విధానసభలో చర్చించిన అనంతరం రాజ్యాంగం ద్వారా ఏర్పడినది. స్వాతంత్ర్యానికి పూర్వమే అంబేద్కర్ ఆధ్వర్యంలో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ మొదలైంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత 2015 నుండి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాలు జరగడం లేదు. "కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, ప్రభుత్వం" కలిసి కార్మిక చట్టాల అమలు, కార్మికుల వెతలు, యాజమాన్య వ్యవస్థ స్థితిగతుల వంటి వాటిపై చర్చించాల్సిన అధికారిక కార్యక్రమం పూర్తిగా విడనాడబడింది. దీన్నిబట్టి కార్మికుల పట్ల కార్మిక సంఘాల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఎంతటి నిర్లక్ష్యపూరిత వైఖరి ఉన్నదో స్పష్టమవుతోంది. ఇకనుండి 'ఫేర్ వేజ్, లివింగ్ వేజ్, మినిమమ్ వేజ్' అన్న విధానాలు ఉండవు. యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై వేతనాలు ఆధారపడి ఉంటాయి. పెట్టుబడిదారులు కంపెనీ లాభాల కోసం వర్కర్ల వేతనాలను టార్గెట్ చేసుకోవడం చూస్తున్నాం. అయితే కార్మికోద్యమ చరిత్రలో ఏనాడూ యాజమాన్యాలుగానీ ప్రభుత్వాలుగానీ తమ దయాదాక్షిణ్యాలతో చేయి విదిలించిన సందర్భాలు లేవు. ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, చట్టాలు పోరాడి సాధించుకున్నవే తప్ప బుర్జువా పాలకులు ఇష్టంతో ప్రసాదించినవి కాదు. రాజకీయాలు పూర్తిగా డబ్బు మయమైపోయి, అమాయక ఓటర్లను చిరు కోరికలతో మోసం చేసే ప్రక్రియలో పాలక వర్గాలకు ఆశ్రిత పెట్టుబడిదారులు ఉపయోగపడుతున్నారు కాబట్టే ఇలాంటి దుర్నీతి చట్టాలు ముందుకొస్తున్నాయి. వీటిని ఎదుర్కొనే భాష కేవలం పోరాటం మాత్రమే.

# రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేరు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులు నెలలు గడిచినా ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండటం, గవర్నర్లు, రాష్ట్రపతి సమ్మతి ఆలస్యం చేయడం, ఈ అంశం గత కొంతకాలంగా పెద్ద చర్చగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆర్టికల్ 143 కింద పంపించిన ప్రశ్నలకు (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం సమాధానం ఇచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం గడువు విధించడం రాజ్యాంగానికి సరిపోదని స్పష్టం చేసింది. అయితే గవర్నర్లు కారణం చెప్పకుండా బిల్లులను వెనక్కి పంపడం సరికాదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వెల్లడించిన ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి:

సుప్రీంకోర్టు ప్రకారం, ఒక బిల్లు గవర్నర్ ఎదుటకు వచ్చినప్పుడు ఆయనకు మూడు ఆప్షన్లు ఉంటాయి: బిల్లుకు సమ్మతి తెలపడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి తిరిగి పంపడం. ఈ మూడు ఎంపికల్లో ఏదిని ఎంచుకోవాలో నిర్ణయించడం గవర్నర్ విచక్షణాధికారం. ఈ వ్యవహారంలో కోర్టు గడువు పెట్టడం సరైంది కాదని స్పష్టం చేసింది. గవర్నర్ల విధులు, నిర్ణయాలలో కోర్టులు సాధారణంగా జోక్యం చేసుకోలేవని ధర్మాసనం చెప్పింది. కానీ కారణం లేకుండా బిల్లులను దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచితే అది న్యాయపరమైన సమీక్ష పరిధిలోకి వస్తుందని పేర్కొంది. రాష్ట్రపతికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్‌గా పంపిన ప్రతిసారి రాష్ట్రపతి సుప్రీంకోర్టును సంప్రదించాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ఎప్పుడైతే అవసరం అనుకుంటారో అప్పుడే అభిప్రాయం కోరవచ్చని తెలిపింది. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణ అధికారమున్నప్పటికీ, దాన్ని అతి పరిమాణంలో వినియోగించడం సరికాదని సుప్రీం హెచ్చరించింది. బిల్లులను తిరిగి పంపినా, నిలిపినా సరైన కారణాలతో రాతపూర్వకంగా తెలియజేయాలని తెలిపింది.. లేదంటే భవిష్యత్తులో వివాదాలు తప్పవని కోర్టు అభిప్రాయపడింది.



రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన పలు బిల్లులు నెలల తరబడి గవర్నర్ల వద్ద నిలిచిపోవడం, రాష్ట్రపతికి పంపినవీ సంవత్సరకాలం పాటు పరిష్కారం కాని పరిస్థితి ఏర్పడడంతో కొన్ని రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ద్విసభ్య ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. గవర్నర్, రాష్ట్రపతి ఇద్దరూ మూడు నెలల్లోగా బిల్లుపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా వాదోపవాదాలకు దారితీసింది.

అదే తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం సుప్రీం అభిప్రాయాన్ని కోరారు. రాష్ట్రపతి, గవర్నర్ విచక్షణాధికారంలో కోర్టు గడువు విధించడం ఎంతవరకు న్యాయసమ్మతమో వివరించాలని కోరుతూ సీజేఐకి లేఖ రాశారు. ఈ అంశంపై పది రోజులపాటు అన్ని పక్షాల వాదనలు విన్న రాజ్యాంగ ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వ్‌లో పెట్టింది. తాజాగా వచ్చిన తీర్పులో కోర్టు గడువు విధించడం రాజ్యాంగబద్ధం కాదని, కానీ అనవసర ఆలస్యం కూడా అనుమతించబడదని చెప్పి దీనికి రాజ్యాంగ పరిమితులు ఉన్నాయని స్పష్టం చేసింది.

# ఎవ్వరూ ఊహించలేని 'గుండె పోటు'

## ఆ టైంలో ఇలా చేస్తే ప్రాణదాతలు మీరే కావచ్చంటున్న నిపుణులు!

విద్యార్థులు, చిన్నారులు, డీజే దగ్గర డాన్స్ చేస్తున్న యువత! ఆటల్లోనో, వ్యాయామం చేస్తున్నపుడో హఠాత్తుగా గుండెపోటుతో మరణిస్తున్నారు. అప్పటి వరకు నవ్వుతూ కనిపించిన వారు క్షణాల్లో కుప్పకూలుతున్న వైనం చూస్తున్నాం. ఒకప్పుడు 50 ఏళ్ల పైబడిన వారిలో కనిపించే గుండెపోటు, ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా వస్తోంది. ఈ పరిస్థితుల్లో సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడొచ్చు. అందుకే ప్రతి వ్యక్తి దీనిపై అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో సీపీఆర్?కి ముందు చేయాల్సిన పనులు గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

వ్యక్తి ఎక్కువ ఒత్తిడికి గురైనప్పుడు రక్త ప్రసరణలో తేడా వస్తుంది. అటువంటి సందర్భాల్లో, మెదడు, ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తం ప్రసరణ నిలిచిపోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సీపీఆర్ ద్వారా రక్త ప్రవాహాన్ని త్వరగా పునరుద్ధరించి బాధితుడిని కాపాడవచ్చని చెబుతున్నారు. గుండెపోటు వచ్చిన తర్వాత, అవయవాలన్నీ పనిచేయడం ఆగిపోవడానికి దాదాపు ఐదు నుంచి పది నిమిషాల సమయం పడుతుందని తెలియజేస్తున్నారు. మెదడును సజీవంగా ఉంచి ప్రాణాల్ని రక్షించేందుకు సీపీఆర్ అవకాశం ఇస్తుందని పేర్కొంటున్నారు. %భ్రూ=% అనేది ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా హృదయ స్పందన ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర చికిత్స అని అధ్యయనం పేర్కొంది.



సీపీఆర్ అవసరమైన వ్యక్తి స్పృహలో ఉన్నారా? లేదా అపస్మారక స్థితిలో ఉన్నారా చూడాలి. వ్యక్తి స్పృహలో ఉంటే, వారిని ఆ స్థితిలో ఉంచడానికి మాట్లాడుతూ, ప్రతిస్పందనను పొందేందుకు ప్రశ్నలు అడుగుతూ ఉండాలి. సాధ్యమైనంత త్వరగా దగ్గరలోని ఆస్పత్రికి లేదా అంబులెన్స్‌కు కాల్ చేయాలి. సమీపంలో ఎవరైనా వైద్య నిపుణులు అందుబాటులో ఉంటే, వారిని సీపీఆర్ చేయాలని అడగండి. సమాజంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్ నేర్చుకోవడం మంచిది. దీనిపై ఎన్జీవోలు, ఆసుపత్రులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీంతో పాటు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మధుమేహం, రక్తపోటు వంటి పరీక్ష చేయించుకోవడం చాలా మంచిది. కుటుంబంలో ఎవరికైనా కొలెస్ట్రాల్ ఉన్నట్లైతే ముందు జాగ్రత్త పడాలి అని డాక్టర్ సీనియర్ కార్డియాలజిస్ట్ ఎ.వి ఆంజనేయులు తెలియజేస్తున్నారు.


మీరు సీపీఆర్‌ను సరిగ్గా నిర్వహిస్తున్నారని నిర్ధారించుకోవడానికి సీఏబీ (సర్క్యులేషన్, ఎయిర్‌వే, బ్రీతింగ్)ను గమనించాలి. ఈ మార్గదర్శకాలను వ్యక్తిలో రక్త ప్రసరణను పునరు ద్ధరించడానికి నిర్వహిస్తారు. బాధిత వ్యక్తిని సమాంతరంగా పడుకోబెట్టి, మెడ పక్కన మీరు మోకాళ్లపై నిల్చొని ఉండాలి. ఒక చేతి మడమను బాధితుడి ఛాతీ మధ్య భాగంలో, దానిపైన మరో చేతిని ఉంచాలి.

మీ చేతులు, భుజాలు కచ్చితంగా నిటారుగా ఉన్నాయని నిర్ధారించుకోవాలి. మీ బలాన్ని ఉపయోగించి బాధితుడి ఛాతీని కనీసం రెండు అంగుళాలు లోపలకు పోయేలా గట్టిగా వత్తాలి.

కిందికి నొక్కడం పైకి వదలడం అనేది రెండు సమానంగా చేయాలి. మధ్యలో వదిలేయకూడదు. ఇలా ఎవరైనా వైద్యుల సాయమందే వరకూ చేస్తుండాలి. అప్పటికీ కదలిక లేకపోతే నోటి ద్వారా గాలి ఊదడం ప్రారంభించాలి. బాధితుడి నుదిటిపై మీ అరచేతిని ఉంచి, వారి తలను సున్నితంగా వెనుకకు వంచి గడ్డాన్ని పైకి లేపాలి.వ్యక్తి నోరు తెరిచినప్పుడు ముక్కును మూసివేసి, మీ నోటితో గాలిని ఊదడం ప్రారంభించాలి. ఛాతీపై చాలా శ్రద్ధ వహించి, అది పెరుగుతుందో లేదో చూడాలి.

అదే విధంగా కొంత సేపు ఇస్తూ ఉండాలి. ఛాతీ పైకి లేవకపోతే, ఇదే ప్రక్రియను తిరిగి కొనసాగించాలి.

# ఎన్ని చేసినా మొటిమలు తగ్గట్లేదా..



ప్రస్తుతం యువతకు పెద్ద సమస్య ముఖంపై మొటిమలు రావడం. ఈ మొటిమల సమస్యకు అనేక మంది ఎన్నో రకాల సౌందర్య సాధనాలను వాడుతుంటారు. కానీ చాలా రకాల ఉత్పత్తులు యువత ఆశించిన విధంగా పని చేయకపోవడం వలన వారు దిగులు చెందుతూ ఉంటారు. అనేకసార్లు సౌందర్య ఉత్పత్తులను మారుస్తూ ఉంటారు. ఇలా అనేక రకాల సౌందర్య ఉత్పత్తులను వాడడం వలన కూడా చర్మ సౌందర్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇలా మొటిమలు రావడానికి అనేక రకాల కారణాలు ఉన్నాయని నిపుణులు తెలుపుతున్నారు. మొటిమలు రావడానికి ప్రస్తుత జీవనశైలి విధానం కూడా ఒక కారణమని అనేక మంది అభిప్రాయం. మన ముఖం మీద మొటిమల దాడిని ముందే గ్రహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. మొటిమలు దాడి చేసే ముందే మన చర్మం లోపల ఉన్న ఆరోగ్యకర కణాలు నశిస్తాయి. కణాలు పాడవడం వలన చర్మం మీద మొటిమలు ఏర్పడే అవకాశం ఉంటుంది. కేవలం ఇది మాత్రమే కాకుండా మన చర్మం పొడి బారడం వలన కూడా మొటిమలు ఏర్పడే చాన్స్ ఉంది. మన చర్మం మీద ఉండే రంధ్రాలు బ్లాక్ అయినపుడు కూడా మొటిమలు వస్తాయి. మానవ శరీరంలో చర్మం అనేది చాలా సున్నితమైన అవయవం. కావున చర్మాన్ని ఆరోగ్యంగా చూసుకునేందుకు అనేక రకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలి. సమయం ప్రకారం చర్మానికి కావాల్సిన అవసరాలు తీరుస్తూ ఉండాలి. చర్మ సౌందర్యం గురించి జాగ్రత్తలు తీసుకోవడంలో వివిధ రకాల వ్యక్తులు వివిధ రకాలుగా వ్యవహరిస్తూ ఉంటారు. కొంతమంది అధిక ధర ఉన్న సౌందర్య సాధనాలు వాడితే కొంత మంది మాత్రం ఎటువంటి సౌందర్య సాధనాలు వాడకుండా ఉంటారు. కానీ ఇలా అనేక రకాల సౌందర్య సాధనాలను చర్మంపై ప్రయోగించడం మంచిది కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇలా అనేక రకాల సౌందర్య సాధనాలను వాడడం వలన కూడా మన చర్మంపై మొటిమలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ సమస్య యువతను చాలా వేధిస్తుంది. ఈ సమస్య గురించి తప్పించుకునేందుకు అనేక మంది అనేక రకాలుగా ప్రయత్నిస్తూ ఉంటారు. మార్కెట్‌లో దొరికే అన్ని రకాల చర్మ సౌందర్య ఉత్పత్తులను వాడి అలసిపోతారు.

ముఖంపై మొటిమలు వచ్చే ప్రమాదం ఉందనుకున్న సమయంలో మన చర్మంలో ఉండే ఆరోగ్య కరమైన కణాలు చర్మం మీది పొరకు వస్తాయి. ఆరోగ్యకర కణాల టర్నోవర్ రేటు పెరగడం వలన మన చర్మంపై మొటిమలు రాకుండా ఉంటాయి. మన చర్మం అనేక లేయర్లను కలిగి ఉంటుంది. కనుక ఒక లేయర్ పాడయిపోయినప్పటికీ మరో లేయర్ మన చర్మంపై మొటిమలు రాకుండా కాపాడుతుంది. కానీ మన చర్మం పొడి బారి పోయినపుడు మొటిమలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రముఖ ఆరోగ్య నిపుణులు చెప్పిన దాని ప్రకారం.. మానవ శరీరం చూసేందుకు ఎటువంటి తేడా లేకుండా ఉన్నా.. చర్మం రకాలు వివిధ రకాలుగా ఉంటాయి. ఆయిలీ, డ్రై తదితర రకాలు ఉంటాయి. అన్ని రకాల సౌందర్య సాధనాలు వివిధ రకాల చర్మాలు గల వారికి అంతగా సరిపోవు. కావున ఏదైనా ఉత్పత్తిని కొనే ముందు ఎటువంటి రకం చర్మం కల వారికి సరిగ్గా సరిపోతుందో చూసి కొనాలి. ఒకే రకమైన సౌందర్య ఉత్పత్తులు అందరికీ సరిపోవనే విషయం గుర్తుంచుకోవాలి.

# హసీనా అప్పగింత కోసం ఇంటర్‌పోల్‌కు బంగ్లాదేశ్ ?



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత్ నుంచి తమ మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత కోసం ఇంటర్‌పోల్‌ను బంగ్లాదేశ్ ఆశ్రయించనుంది. షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ప్రభుత్వం మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. దీంతో ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనా, బంగ్లా మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌ల అప్పగింతపై ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు అక్కడి మీడియా సంస్థలు వెల్లడించాయి.

దేశం విడిచి పారిపోయిన హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లా ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేపట్టారని బంగ్లాదేశ్ దినపత్రిక ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులపై రెడ్ నోటీసులు జారీ చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఇంటర్‌పోల్‌కు అరెస్ట్ వారెంట్‌తో పాటు దరఖాస్తు సమర్పించినట్లు తెలిపింది.

కాగా, మరోవైపు హసీనాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ ట్రైబ్యునల్ మరణ దండన విధించిందని పేర్కొంటూ ఆమెను తమకు అప్పగించాలని ఆ దేశ విదేశాంగశాఖ భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అయితే.. హసీనాపై వచ్చిన అభియోగాలు రాజకీయంగా చేసినవే తప్ప వాటిలో వాస్తవం లేదని భావిస్తున్న భారత్.. ఆమెను ఎట్టిపరిస్థితుల్లోనూ వారికి అప్పగించదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# మావోయిస్టులు హింసా మార్గాన్ని వదిలేస్తున్నారు

## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**ఛత్తీస్‌ఘడ్:** దేశవ్యాప్తంగా మావోయిస్టులు హింసా మార్గాన్ని వదిలి ప్రధాన స్రవంతిలోకి వస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారకు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తూ వామపక్ష తీవ్రవాదం నిర్మూలనను సాధ్యం చేస్తున్నాయని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో "జన్‌జాతీయ గౌరవ్ దివస్" కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ డేకా, ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ సైతం పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన ద్రౌపదీ ముర్ము, దేశవ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కృషి చేస్తున్న నేపథ్యంలో వామపక్ష తీవ్రవాద నిర్మూలన త్వరలోనే సాధ్యమవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. హింస మార్గాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వస్తున్న నక్సలైట్లు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. అంబికాపుర్‌లోని సురగుజా జిల్లా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జన్?జాతీయ గౌరవ్ దివస్ వేడుకలో ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ డేకా, ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ కూడా హాజరయ్యారు. గిరిజన మహానాయకుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జరుపుకునే ఆ వేడుకలో రాష్ట్రపతి గిరిజన సమాజానికి ప్రాధాన్యం, వారు దేశ అభివృద్ధిలో పోషిస్తున్న పాత్రను వివరించారు. సమగ్ర వికాసానికి వారి సహకారం అత్యంత కీలకం!

గిరిజన సమాజాలు ఇతర సామాజిక వర్గాల సరసన దశలవారీగా ముందుకు సాగాలని రాష్ట్రపతి ముర్ము ఆకాంక్షించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్య మయ్యే కొద్దీ వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. దేశ సమగ్ర వికాసానికి వారి సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన బస్తర్ ఒలింపిక్స్‌లో లక్షా అరవై అయిదు వేల మందికి పైగా పాల్గొనడం విషయంలో తాను సంతోషకరంగా భావిస్తున్నానని ముర్ము అన్నారు. క్రీడలు గిరిజన సమాజానికి సహజ ప్రతిభ, వారిలోని శక్తి, సామర్థ్యాలను బయటకు తీసే వేదికలని చెప్పారు. అంతేకాకుండా క్రీడా రంగంలో గిరిజన యువత సత్తా చాటుతున్నారని, ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో భారత మహిళల వరల్డ్ కప్ విజేత జట్టును కలిసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రత్యేకంగా గిరిజన యువ క్రికెటర్ కరణ్తి గౌడ్‌ను ప్రశంసించారు. ఆమె ప్రయాణం చాలా సవాళ్లతో నిండి ఉందని తెలిపారు. కానీ కష్టపడి, అంకితభావంతో జాతీయ జట్టులో కరణ్తి గౌడ్ స్థానం సంపాదించిందని తెలిపారు. ఆమె ధైర్యం, పట్టుదల దేశంలోని గిరిజన బాలికలకు ఆదర్శమని చెప్పారు.

అయితే సంప్రదాయ క్రీడలను కాపాడి, ప్రచారం చేయడం ముఖ్యమని ఆమె హితవు పలికారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల నుంచి వెలువడే ప్రతిభావంతుల కోసం మెరుగైన అవకాశాలు అందుబాటులోకి రావాలని ఆమె కోరుకున్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్రను ప్రస్తావించారు. మహిళలు ఎదిగితేనే సమాజం ముందుకు సాగుతుందని తెలిపారు. వారి సాధికారతతోనే అభివృద్ధి మార్గం బలోపేతం అవుతుందని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.




# ఐపీఎల్ వేలం రద్దు చేయండి

## దాని స్థానంలో డ్రాఫ్ట్ పద్ధతి తీసుకురావాలి: రాబిన్ ఊతప్ప




భారత మాజీ క్రికెటర్, రెండుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ రాబిన్ ఊతప్ప ఈ మెగా లీగ్‌లో భారీ మార్పులు తీసుకురావాలని సూచించాడు. ఆటగాళ్ల వేలం విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, దాని స్థానంలో డ్రాఫ్ట్ పద్ధతిని ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డాడు. అలాగే రెండున్నర నెలల టోర్నీని ఆరు నెలల లీగ్‌గా విస్తరించాలని, ఏడాది పొడవునా ప్లేయర్ల ట్రేడింగ్ విండోను తెరిచి ఉంచాలని తన యూట్యూబ్ ఛానెల్‌లో పేర్కొన్నాడు.

"ఐపీఎల్ ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్. కానీ ఇప్పటికీ అది స్టార్టప్ దశను దాటడం లేదు. ఇకనైనా పరిణతితో వ్యవహరించాలి. దయచేసి వేలాన్ని రద్దు చేయండి. నేను ఆడుతున్న రోజుల నుంచే ఈ మాట చెబుతున్నాను" అని ఊతప్ప వ్యాఖ్యానించాడు. కేవలం టీవీ వినోదం అనే ఆలోచన నుంచి బయటకు రావాలని సూచించాడు. డ్రాఫ్ట్ విధానం కూడా టీవీలో ఆసక్తికరంగా ఉంటుందని, అభిమానుల్లో జట్టు పట్ల మరింత నమ్మకం పెరుగుతుందని వివరించాడు.

"ఐపీఎల్‌ను ఆరు నెలల లీగ్‌గా మార్చాలి. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు కూడా నిర్వహించుకోవచ్చు. కాలానికి అనుగుణంగా లీగ్ మారాలి" అని ఊతప్ప అన్నాడు. డిసెంబర్ 16న అబుదాబిలో ఐపీఎల్ వేలం జరగనున్న నేపథ్యంలో ఊతప్ప వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవలే ట్రేడింగ్ విండోలో సంజూ శాంసన్‌ను చెన్నై సూపర్ కింగ్స్‌కు, రవీంద్ర జడేజా, శామ్ కరన్‌లను రాజస్థాన్ రాయల్స్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

# సౌతాఫ్రికాతో వన్డేలకు హార్దిక్ పాండ్య, బుమ్రాకు రెస్ట్!




సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ టీ20 ఫైనల్‌కు ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య తొడ కండరాల గాయం బారిన పడ్డాడు. ప్రస్తుతం అతడు నేషనల్ క్రికెట్ అకాడమీలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకుంటున్నందున ఒకేసారి 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడటం రిస్క్ అవుతుంది. అందుకే టీ20 ప్రపంచ కప్ వరకు ఈ ఫార్మాట్‌పైనే దృష్టి సారించాలని హార్దిక్‌కు బీసీసీఐ ) మెడికల్ టీమ్ సూచించినట్లు సమాచారం. ఫాస్ట్ బౌలర్ల వర్క్ లోడ్ నిర్వహించే ప్రణాళికలో భాగంగా బుమ్రాకు కూడా సౌతాఫ్రికా వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు టీ20 ప్రపంచ కప్ 2026 సన్నాహకాలలో అంతగా ప్రాధాన్యత ఉండకపోవచ్చనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాబట్టి సౌతాఫ్రికా వన్డే సిరీస్‌కు సీనియర్ ఆటగాళ్లు దూరం కావడంతో యువ ఆటగాళ్లకు అవకాశం దక్కే అవకాశం ఉంది.

గాయం నుంచి కోలుకున్న తర్వాత, హార్దిక్ పాండ్యా ముందుగా బరోడా తరపున సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలో ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత సౌతాఫ్రికా, న్యూజిలాండ్‌తో జరగబోయే టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌లలో పాల్గొంటాడు. 2026లో జరగబోయే టీ20 ప్రపంచ కప్ వరకు 50 ఓవర్ల క్రికెట్‌కు పెద్దగా ప్రాధాన్యత ఉండదు. వచ్చే ఐపీఎల్ తర్వాతే సీనియర్ ఆటగాళ్లు 2027 వన్డే ప్రపంచ కప్ సైకిల్‌పై దృష్టి పెడతారు.




# నేడు 'కొదమసింహం' రీ రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో సక్సెస్, జానర్ పరంగా చూస్తే ఒక ప్రత్యేకమైనదిగా "కొదమ సింహం" సినిమాను చెప్పు కోవచ్చు. చిరంజీవి నటించిన ఒకే ఒక కౌబాయ్ సినిమా ఇది. 1990, ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించిన "కొదమ సింహం" సినిమాను ఈ నెల 21వ తేదీన 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్ తో సరికొత్తగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వర రావు రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ప్రెస్ ప్రీమియర్ షో, ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్ లో స్పెషల్ వీడియో ద్వారా మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.




మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ కొదమసింహం సిని మాలో నా స్టిల్ చాలా పాపులర్. నాకు ఫేవరేట్ ఫొటో అది. నాకు నచ్చిందని ప్రొడ్యూసర్స్ ఆ స్టిల్ ను ఫ్రేమ్ చేసి గిఫ్ట్ గా ఇచ్చారు. మా ఇంట్లో ఇప్పటికీ ఈ ఫొటో ఉంది. నాకు కౌబాయ్ మూవీస్ అంటే ఇష్టం. క్లింట్ ఈస్ట్ వుడ్, గ్రెగరీ పెక్, ఒమర్ షరీఫ్ వంటి స్టార్స్ చేసిన సినిమాలను ఇష్టంగా చూస్తుండేవాడిని. నేను యాక్టర్ అయ్యాక అలాంటి కౌబాయ్ మూవీ వస్తుందని, నేను చేస్తానని ఊహించలేదు. అప్పటికి హీరో కృష్ణ చేసిన మోసగాళ్లకు మోసగాడు పెద్ద హిట్టై అన్ని రికార్డ్స్ బ్రేక్ చేసింది. అలాంటి సినిమా మళ్లీ చేయడం సాహసమే అవుతుంది. రమా ఫిలింస్ నాగేశ్వరరావు కౌబాయ్ కథతో మీతో ఒక కొత్త తరహా మూవీ చేయాలని ఉందని డైరెక్టర్ మురళీ మోహన్ రావుతో కలిసి వచ్చి నాకు కథ చెప్పారు. కథ బాగా నచ్చి వెంటనే అంగీకారం తెలిపాను. అలా కొదమసింహం సినిమా మీ ముందుకు వచ్చింది. మొదటిసారి నేను గడ్డం పెంచి నటించిన సినిమా ఇది. ఈ సినిమాలో నాకు నచ్చిన క్యారెక్టర్ మోహన్ బాబు చేసిన సుడిగాలి క్యారెక్టర్. ఈ క్యారెక్టర్ లో ఫన్, జుగుప్స, విలనిజం అన్నీ కలిపి ఉంటాయి. మోహన్ బాబు కాకుండా మరో నటుడైతే ఈ పాత్రను ఇంత బాగా ఒప్పించి మెప్పించి ఉండేవారు కారు. అది మోహన్ బాబు వల్లే సాధ్యమైంది. విలన్‌గా బాలీవుడ్ లెజెండరీ నటుడు ప్రాణ్ నటిం చారు. ఆయనతో కలిసి నటించే అదృష్టం నాకు కొదమసింహం సినిమాతో దక్కింది. కైకాల సత్యనారాయణ, మారుతీరావు, అన్నపూర్ణ, సోనం, రాధ వీళ్లతో కలిసి నటించాను. వీళ్లతో ప్రతి సీన్, ప్రతి సాంగ్, ప్రతి యాక్షన్, హార్స్ రైడింగ్, ఇవన్నీ హైలైట్స్. ఈ సినిమాలోని అన్ని సాంగ్స్ సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. రాజ్ కోటి అంత మంచి సాంగ్స్ ఇచ్చారు. జపం జపం జపం కొంగ జపం పాట నా ఫేవరేట్ సాంగ్. ప్రభుదేవా చక్కటి కొరియోగ్రఫీ చేశాడు. తన స్టైల్‌ను ఫాలో అయ్యాను. ఈ పాటలో ఫ్లోర్ నుంచి గోడపైకి స్టెప్స్ వేస్తూ మళ్లీ ఫ్లోర్ మీదకు వచ్చే డ్యాన్స్ మూవ్ మెంట్ ఉంది. ఒకే షాట్ లో ఆ స్టెప్ ఉంటుంది. దీన్ని ఎలా చేశారని అందరూ సర్ ప్రైజ్ అయ్యి అడిగారు. మెట్లున్న ఒక వీల్ కు కెమెరా పెట్టి చేశాం. ఇన్సెప్షన్ అనే హాలీవుడ్ మూవీలో అలాంటి షాట్ చేశారు. మేము ఆ టైమ్ లోనే ఇలాంటి టెక్నాలజీ వాడి ఆ షాట్ చేయగలిగాం. నాకు కొదమసింహం ఫేవరేట్ మూవీ, అయితే నాకంటే రామ్ చరణ్ కు ఈ సినిమా ఇంకా ఎక్కువ ఇష్టం. చిన్నప్పుడు తను వాళ్ల అమ్మ ఈ సినిమా క్యాసెట్ పెడితే గానీ భోజనం చేసేవాడు కాదు. అంతగా చరణ్ కు ఇష్టమైన సినిమా ఇది. రీ రిలీజ్ ల టైమ్ ఇది. ఈ జెనరేషన్ ప్రేక్షకులకు కూడా మనం చేసిన కౌబాయ్ సినిమా ఎలా ఉంది, మన డ్యాన్సెస్, మన ఫైట్స్, మన యాక్షన్ సీక్వెన్సులు ఎలా ఉన్నాయి మన క్యారెక్టరైజేషన్స్అప్పట్లో ఎలా తీశారు అని తెలియజేసే ప్రయత్నం చేస్తున్నందుకు రమా ఫిలింస్ నాగేశ్వరరావు గారికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. వారి ప్రయత్నం సక్సెస్ కావాలని కోరుకుంటున్నా. ప్రేక్షకులు ఈ సినిమాను తప్పకుండా ఎంజాయ్ చేస్తారు. థియేటర్స్ లో ఈ నెల 21 చూడండి. అన్నారు.

# తన మార్ఫింగ్ చిత్రాలపై కీర్తి సురేశ్ తీవ్ర ఆవేదన



ప్రముఖ కథానాయిక కీర్తి సురేశ్ తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఏఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్ టెక్నాలజీతో సృష్టించిన ఈ నకిలీ ఫొటోలు తనను మానసికంగా ఎంతగానో బాధిస్తున్నాయని, విసుగు పుట్టిస్తున్నాయని సోషల్ మీడియా వేదికగా వాపోయారు. ఈ నకిలీ చిత్రాలు ఎంత సహజంగా ఉన్నాయంటే, వాటిని చూసినప్పుడు నిజంగానే తను అలా ఫోజు ఇచ్చానా? అని తనను తానే ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి తెలిపారు. ఏఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారుతోందో చెప్పడానికి ఇదే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఈ టెక్నాలజీ సామర్థ్యాలను నియంత్రించడం కష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా ఇతరుల చిత్రాలను ఇలా దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కీర్తి సురేశ్ అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకే పరిమితం కాదని, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఉపయోగించే ప్రతి ఒక్కరికీ ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. కీర్తి ఆవేదనకు నటి ఆండ్రియా జెరెమియా మద్దతు తెలిపారు. గతంలో రష్మిక మందన్న, సమంత వంటి నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ సమస్యను ఎదుర్కొన్నారు. ఈ ఘటన ఏ1 దుర్వినియోగంపై మరింత కఠినమైన చట్టాల అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తోంది.




# 'వారణాసి' చిత్రంలో తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పనున్న ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంకా చోప్రా, తాను నటిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'లో తన పాత్రకు తెలుగులో స్వయంగా డబ్బింగ్ చెప్పనున్నట్లు స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ విషయాన్ని ఆమె ధృవీకరించారు. తెలుగు ప్రేక్షకులపై ఉన్న అభిమానంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



తెలుగు భాష నేర్చుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నానని, దీని కోసం దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి సహాయం తీసుకుంటున్నానని ప్రియాంకా ఇటీవల ఓ సందర్భంలో వెల్లడించారు. "ప్రమోషన్ కార్యక్రమాల్లో తెలుగు మాట్లాడేటప్పుడు ఏమైనా తప్పులు దొర్లితే క్షమించాలి" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కెరీర్ ఆరంభంలో 'అపురూపం' అనే తెలుగు చిత్రంలో నటించినప్పటికీ, అది విడుదల కాలేదు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆమె 'వారణాసి'తో తెలుగు ప్రేక్షకులను నేరుగా పలకరించబోతున్నారు. రాజమౌళి దర్శకత్వంలో అత్యంత భారీస్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు 'రుద్ర' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ప్రియాంకా చోప్రా 'మందాకిని' పాత్ర పోషిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. ప్రియాంక సొంతంగా డబ్బింగ్ చెప్పనుండటంతో ఈ సినిమా తెలుగు వెర్షన్‌పై ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**